ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తమిళనాడు
TAMILNADU
ఆదివారం 7 ఏప్రిల్ 2024

రాష్ట్రంలో ఐటీ కలకలం!

రెండ్రోజుల్లో 40 చోట్ల సోదాలు ● ప్రముఖ నేతలు, అనుచరుల ఇళ్లే లక్ష్యం



పెరంబూర్, ఏప్రిల్ 6: రాష్ట్రంలో ఐటీ దాడులు కలకలం రేపుతున్నాయి. ఏ క్షణంలో ఆ శాఖ అధికారులు వచ్చి పడతారో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేలా నగదు, బహుమతుల పంపిణీ విస్తృతంగా జరుగుతున్న నేపథ్యంలో అడ్డుకొనేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.160 కోట్ల మేర నగదు స్వాధీనం చేసుకున్నాయి. ఎన్నికల కమిషన్ చర్యలతో ఖంగుతిన్న పార్టీలు తమ అనుయాయులు, ప్రభుత్వ కాంట్రాక్టర్ల ద్వారా నగదు పంపిణీకి సిద్ధమవుతున్నాయి. ఈ సమాచారం అందుకున్న ఐటీ శాఖ పంజా విసురుతోంది. చెన్నై సహా ప్రధాన నగరాల్లో ఐటీ శాఖాధికారులు సోదాలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం చెన్నైలో జరిపిన తనిఖీల్లో రూ.4 కోట్లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ వివిధ పార్టీల నేతలు, ప్రభుత్వ కాంట్రాక్టర్ల ఇళ్లు, కార్యాలయాలతో కలిపి మొత్తం 40 ప్రాంతాల్లో ఐటీ అధికారులు శుక్రవారం ఉదయం సోదాలు చేపట్టారు. ఈ తనిఖీలు శనివారం కూడా కొనసాగాయి.

రాజధాని నగరంలో...

రాజధాని నగరం చెన్నైలోని విరుగంబాక్కం, అడయార్ ఇందిరానగర్, తిరువాన్మియూర్, అభిరామపురం తదితర నాలుగు ప్రాంతాల్లో ఐటీ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. వాటిలో విరుగంబాక్కంలో చేపట్టిన తనిఖీలు మాత్రం ముగిశాయి. ఈ తనిఖీల్లో సుమారు రూ.3 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారని వార్తలొచ్చినా ఐటీ శాఖ నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. అడయార్ ఇందిరానగర్‌లో రియల్ ఎస్టేట్ సంస్థలో చేపట్టిన తనిఖీలు శనివారం కొనసాగాయి. తిరువాన్మియూర్‌లో రామచంద్రన్ అనే పారిశ్రామికవేత్త ఇల్లు, అభిరామపురంలో మాజీ సహాయ నిర్వాహక ఇంజనీర్ తంగవేలు ఇంట్లో అధికారులు తనిఖీలు చేపట్టారు.

ప్రధాన నగరాల్లో...

కోయంబత్తూర్ కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలో కాంట్రాక్టర్ అవినాశి రవి ఇల్లు, కార్యాలయాల్లో రెండు రోజులుగా తనిఖీలు చేపట్టిన అధికారులు కొన్ని కీలక దస్తావేజులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అలాగే, రామ్‌నగర్‌లోని రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయంలో ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరువణ్ణామలై జిల్లా సేత్తుపట్టు సెంజి రోడ్డులో నామ్ తమిళర్ పార్టీ జిల్లా ఆర్గనైజర్ సెంథిల్ కుమరన్‌కు సొంతమైన నగల దుకాణంలో ఐటీ శాఖ కమిషనర్ సుబ్రమణి నేతృత్వంలో 20 మంది అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. తేని నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా చెన్నై, తంజావూరు సహా పలు ప్రాంతాలకు చెందిన నేతలు, కార్యకర్తలు తేనిలో ప్రచారం చేస్తున్నారు. పెరియకుళం వడకరైలోని ఓ లాడ్జిలో ఏఎంఎంకేకు చెందిన 15 మంది బస చేస్తూ, పెరియకుళం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో, వీరు ఓటర్లకు నగదు అందించే అవకాశముందనే ఫిర్యాదుతో నలుగురితో కూడిన అధికారుల బృందం వారి గదిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. వారి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు తనిఖీ చేసిన అధికారులకు, నగదు బట్వాడాకు సంబంధించిన ఏ ఆధారం లభించలేదని సమాచారం. తిరునల్వేలి జిల్లాలో రహదారులు, ప్రజాపనుల శాఖ టెండర్లు పొందుతున్న ప్రభుత్వ కాంట్రాక్టర్ ఆర్ఎస్ మురుగన్‌కు సొంతమైన ఫాంహౌస్‌లో ఆరుగురు అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. అలాగే, పాళై పెరుమాళ్‌పురంలోని ఆయన కార్యాలయం, ఎన్జీఓ కాలనీలోని ఆయన ఇళ్లల్లో అధికారులు సుమారు 15 గంటలకు పైగా తనిఖీల్లో పాల్గొన్నారు. కాగా, గురువారం డీఎంకే తిరునల్వేలి తూర్పు జిల్లా కార్యదర్శి ఆవుడయప్పన్ కార్యాలయంలో చేపట్టిన తనిఖీల్లో లభించిన వివరాల ఆధారంగా ప్రభుత్వ కాంట్రాక్టర్ ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు జరిగాయని సమాచారం.

ఎమ్మెల్యే పుగళేంది కన్నుమూతతో డీఎంకేలో విషాదఛాయలు

దిగ్భ్రాంతి కలిగించిందన్న సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విక్రవాండి డీఎంకే శాసనసభ్యుడు పుగళేంది(71) హఠాన్మరణంతో నియోజక వర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి.తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వుండిన ఆయన రెండు రోజుల క్రితమే డిశ్చార్జి అయ్యారు. ఈ నేపథ్యంలో డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ విల్లుపురం లోక్‌సభ నియోజకవర్గం డీపీఐ అభ్యర్థి దురై రవికుమార్, కడలూరు కాంగ్రెస్ అభ్యర్థి విష్ణుప్రసాద్‌కు మద్దతుగా విల్లుపురం విక్రవాండి ప్రధాన రహదారిలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటైన ప్రచార సభలో పాల్గొన్నారు. ఆ ప్రచార సభకు పుగళేంది హాజరయ్యారు. బహిరంగ సభ వేదికపై కూర్చున్న పుగళేందికి ఉన్నట్టుండి బీపీ పడిపోయి చెమటలు పట్టాయి. ఆ విషయాన్ని పసిగట్టిన మంత్రి పొన్ముడి, ఆయన సతీమణి విశాలాక్షి పుగళేందికి ప్రాథమిక అందించారు. ఈలోగా మరో ఎమ్మెల్యే లక్ష్మణన్ వేదిక దిగువనున్న పుగళేంది కుమారుడు సెల్వకుమార్‌కు సమాచారం అందించారు. ఆ తర్వాత పుగళేందిని వేదిక నుంచి కిందకు దింపి సీఎం కోసం ఏర్పాటు చేసిన ఏసీ గదిలో కూర్చోబెట్టారు. కాసేపయ్యాక ఆయన్ని అంబులెన్స్‌లో విల్లుపురం ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆయన్ని అత్యవసర చికిత్సా విభాగానికి తరలించి చికిత్సలందజేశారు. శనివారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స ఫలించక పుగళేంది కన్నుమూశారు. ఆయనకు భార్య కృష్ణమ్మాళ్, కుమారుడు సెల్వకుమార్, కుమార్తె సెల్వి, శాంతి, సుమతి ఉన్నారు. 2019లో జరిగిన ఉపఎన్నికలో అన్నాడీఎంకే అభ్యర్థి ముత్తమిళ్‌సెల్వన్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థి ముత్తమిళ్ సెల్వన్‌ను ఓడించారు. పుగళేంది మృతి పట్ల స్టాలిన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొంది మునుపటి వలెనే త్వరగా కోలుకుంటారని ఆశించిన తనకు ఆయన మృతివార్త తీవ్ర దిగ్భ్రాంతికి కలిగించిందన్నారు. పుగళేంది మృతితో శోకతప్తులైన ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు స్టాలిన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడికి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

రంగనాథుడి సేవలో వెంకయ్య

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు శనివారం ఉదయం శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామివారి ఆలయాన్ని దర్శించారు. ఆయనకు ప్రధానా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. అనంతరం ఆయన ఆలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆ తర్వాత ప్రత్యేక సన్నిధుల్లో కొలువుదీరి ఉన్న దేవతామూర్తులను తిలకించారు. ఆ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాలను అందజేసి ఆయన్ని పూలమాలతో, శాలువతో సత్కరించి రంగనాథస్వామి చిత్రపటాన్ని అందజేశారు. స్వామివారికి ప్రీతికరమైన శనివారం రోజున అష్టోత్తర శత వైష్ణవదివ్యక్షేత్రాల్లో అగ్రగామి దివ్యక్షేత్రంగా ఉన్న శ్రీరంగం రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించడం తనకెంతో సంతోషాన్ని కలిగించిందని వెంకయ్య పేర్కొన్నారు. చోళ, పాండ్య, విజయనగర రాజుల కాలం నాటి శిల్పకళను సంతరించుకున్న ఈ ప్రాచీన ఆలయ దర్శించే అవకాశం కలగడం అదృష్టమేనని తెలిపారు.

బీజేపీ ప్రచార వాహనాలను చుట్టుముట్టిన అన్నాడీఎంకే శ్రేణులు

● అన్నాడీఎంకే ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ధర్నా
● మెల్లగా జారుకున్న అన్నామలై

అడయార్, ఏప్రిల్ 6: కోయంబత్తూరు లోక్‌సభ స్థానంలో అన్నాడీఎంకే, బీజేపీలు తారస్థాయిలో ప్రచారం చేపడతున్నాయి. రెండు పార్టీల అభ్యర్థులు క్షేత్రస్థాయిలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. అయితే, శుక్రవారం కోవైలోని సూలూరులో జరిగిన చిన్నపాటి సంఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కోవై బీజేపీ అభ్యర్థి, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై చూసీచూడనట్టుగా వెళ్లిపోయారు. సూలూరు నియోజకవర్గంలోని మాదాపూర్ పంచాయతీలో అన్నాడీఎంకే నేతలు ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి సింగై రామచంద్రన్, సూలూరు ఎమ్మెల్యే వీపీ కందస్వామి ఉమ్మడిగా ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలో పోలీసులు ఇచ్చిన సమయం కంటే ముందుగా బీజేపీ కోవై అభ్యర్థి అన్నామలై ఆ గ్రామానికి ప్రచారానికి వచ్చారు. ఆయన ప్రచార కాన్వాయ్‌లోని కార్లలో ఓ కారు అన్నాడీఎంకే నేతల కారును రాసుకుంటూ వెళ్లింది. దీంతో ఆగ్రహించిన అన్నాడీఎంకే కార్యకర్తలు, నాయకులు, సింగై రామచంద్రన్, ఎమ్మెల్యే కందస్వామి రోడ్డుపై బైఠాయించారు. తమ కారును రాసుకుంటూ వెళ్లిన కారును స్వాధీనం చేసుకుని చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన అన్నామలై తన కారు దిగి, జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. ఆ తర్వాత మరో కారులో ఎక్కి మెల్లగా జారుకున్నారు. అయితే, అన్నాడీఎంకే నేతలు మాత్రం బీజేపీ నేత కారు డ్రైవరుపై చర్య తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. వీరికి పోటీగా బీజేపీ కార్యకర్తలు కూడా నినాదాలు చేయడంతో అక్కడ కాస్త ఉద్రిక్తత నెలకొంది. ఇంతలో అక్కడకు చేరుకున్న పోలీసులు.. అన్నాడీఎంకే నేతలను శాంతపరిచి, ఆందోళనను విరమింపజేశారు.

జాతీయ గ్రంథంగా తిరుక్కురళ్

● కులాలవారీ జనగణన
● ఎండీఎంకే మేనిఫెస్టో విడుదల చేసిన వైగో


మేనిఫెస్టో విడుదల చేస్తున్న వైగో తదితరులు

పెరంబూర్, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎండీఎంకే మేనిఫెస్టోను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో శనివారం తిరుచ్చిలో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. రాష్ట్రాలు స్వయం అధికారంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, బీజేపీ అమలుచేయ తలపెట్టిన రిజర్వేషన్ల రద్దును వ్యతిరేకించడంతో పాటు సామాజిక న్యాయ పరిరక్షణకు కృషి చేస్తామని వైగో ఈ సందర్భంగా ప్రకటించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ... తమ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి లబ్ధి చేకూర్చిపెట్టే పలు పథకాలను అమలు చేస్తామన్నారు. కొన్ని రాష్ట్రాల మాతృభాషగా ఉన్న హిందీని అన్ని రాష్ట్రాలను నిర్బంధం చేయడాన్ని వ్యతిరేకిస్తామన్నారు. తిరుక్కురల్‌ను జాతీయ గ్రంథంగా ప్రకటించేలా చర్యలు చేపడతామన్నారు. నదుల అనుసంధానం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. మెకెదాటుపై డ్యాం నిర్మించాలనే కర్ణాటక చర్యలను అడ్డుకొనేలా చర్యలుంటాయన్నారు. సేతు సముద్ర ప్రాజెక్ట్‌ను ప్రత్యామ్నాయ మార్గంలో చేపట్టేలా ఒత్తిడి తీసుకువస్తామన్నారు. సురక్షిత వ్యవసాయ మండలిగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన ప్రాంతాల్లో సహజ వనరులు వెలికితీసే ప్రాజెక్టులను అమలుచేయరాదని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు జీఎస్టీ విధానాన్ని రద్దు చేసి, పాత విధానం అమలుచేసి రాష్ట్రాల అధికారాన్ని కాపాడతామన్నారు. కులాలవారీ గణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావడంతో పాటు విమానాశ్రయాలను ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తామన్నారు. స్టెరిలైట్ కర్మాగారాన్ని శాశ్వతంగా మూసివేసేందుకు చర్యలు చేపడతామని, కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రం మూసివేత, హైడ్రోకార్బన్ ప్రాజెక్ట్ ఉపసంహరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. ఎల్టీటీఈ నిషేధం శాశ్వతంగా తొలగింపజేయిస్తామని, దేశంలో ఉరిశిక్షను రద్దు చేసేలా ప్రత్యేక చట్టం తెచ్చేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వైగో హామీ ఇచ్చారు.



బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అరాచకమే!

● కడలూరు సభలో సీఎం స్టాలిన్



చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా దేశాన్ని భ్రష్టుపట్టించిన బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం హతమవుతుందని, అంతటా అవినీతి, అరాచకాలు అధికమవుతాయని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. కడలూరులో శనివారం సాయంత్రం చిదంబరంలో పోటీ చేస్తున్న డీపీఐ నేత తిరుమావళవన్, మైలాడుదురైలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, న్యాయవాది సుధకు మద్దతుగా ఏర్పాటైన ప్రచార సభలో ప్రసంగించారు. దేశంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించారు. అరాచక శక్తుల నుండి దేశానికి కాపాడేందుకే ఇండియా కూటమి ఆవిర్భవించిందన్నారు. ప్రధాని మోదీ సామాజిక న్యాయానికి బద్ధశత్రువు అని, అభివృద్ధి అంటే ఆయనకు నచ్చదని, మతసామరస్య భారత్ అనే పదం వింటేనే కోపగించుకునే తత్వం ఆయనదని స్టాలిన్ దుయ్యబట్టారు. పిట్టి త్యాగరాయ శ్రేష్ఠి, డాక్టర్ నటేశనార్, పెరియార్, రెట్టమల శ్రీనివాసన్, అయోధ్యదాస పండితర్, అంబేడ్కర్, కామరాజర్, పెరియార్, అన్నాదురై, కరుణానిధి, వీపీ సింగ్ వంటి మహానుభావులు ప్రతిపాదించిన సామాజిక న్యాయాన్ని దేశవ్యాప్తంగా సుస్థిరపరచేందుకే ఇండియా కూటమి ఆవిర్భవించిందన్నారు. రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్లు అమలు కావడానికి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధే కారణమని చెప్పారు. ఇలాంటి రిజర్వేషన్లంటే మోదీ సుతరామూ నచ్చదని, వాటిని ఎత్తివేయాలని కుట్రపన్నుతుంటారని విమర్శించారు. రాష్ట్రంలో రిజర్వేషన్ల పుణ్యమా అని యువకులు డాక్టర్లుగా, ఐపీఎస్ అధికారులుగా, ఐఏఎస్ అధికారులుగా వస్తుండటం చూసి ఓర్వలేకే ప్రధాని మోదీ రిజర్వేషన్లను ఎత్తి వేయాలని నిర్ణయించారన్నారు. ఈ సారి మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎక్కడా ఉండవన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీజేపీతో పీఎంకే జతకట్టడం గర్హనీయమని పేర్కొన్నారు. ప్రశాంత భారతం, ప్రగతిపూర్వక భారతం అనే నినాదంతో ఆవిర్భవించింది ఇండియా కూటమి అని, ఆ కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత ప్రతిభారతీయుడిపైనా ఉందన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రాలన్ని మున్సిపాలిటీలవుతాయని, గవర్నర్లతో పోటీ ప్రభుత్వాలు నడుస్తాయన్నారు. ఇక ఎన్నికల విధానం రద్దువుతుందని, నిరంకుశత్వం పెరుగుతుందన్నారు. పార్లమెంట్‌లో చర్చలు జరగవని, క్రైస్తవులు, ముస్లింల ప్రాణాలకు ముప్పువాటిల్లు తుందన్నారు. మత చిచ్చుపెట్టేవారిని జాతీయ నాయకులుగా ప్రకటిస్తారన్నారు. ఐటీ, సీబీఐ, ఈడీలను ఉసిగొల్పి బీజేపీ పాలకులు ఎనిమిదివేల కోట్లకు పైగా ఎన్నికల బ్యాండ్ల ద్వారా మెగా అవినీతికి పాల్పడిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పదేళ్లుగా బీజేపీ సాగించిన అవినీతి అక్రమాల గుట్టు రట్టు చేస్తామన్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్ ● ఘనంగా ఉగాది వేడుకలు


ముఖ్య అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు - కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీక్రోధి నామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ ఆకాంక్షించారు. అడయార్‌లోని గాంధీనగర్‌లో ప్రపంచ తెలుగు సమాఖ్య, గాంధీనగర్ లేడీస్ క్లబ్ సంయుక్తంగా శనివారం తెలుగు, తమిళ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించాయి. ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన ఇందిరాదత్ మాట్లాడుతూ... తమ సంస్థ తెలుగు సంస్కృతి సంప్రదాయాలను పెంపొందింపజేయడంతో పాటు తెలుగు భాష వికాసానికి పాటుపడుతోందన్నారు. రెండు సంస్థలు కలిసి తెలుగు, తమిళ నూతన సంవత్సరాదిని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీజీఎన్ హోమ్స్ డైరెక్టర్ పద్మా దేవదాస్ మాట్లాడుతూ... పండుగలు సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు తెలియజేస్తాయని వివరించారు. మహిళలు తమ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయితే ముందుగా శారీరక, మానసిక ఒత్తిడిని జయించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఇదిలా ఉండగా ముఖ్య అతిథిగా సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మీమోహన్‌రావు సభకు పరిచయం చేయగా, గాంధీనగర్ లేడీస్ క్లబ్ కార్యదర్శి ప్రాణేశ్వరి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ముఖ్య అతిథిని ఇందిరాదత్, లేడీస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు దివ్యారెడ్డి తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ పంతులు పంచాంగ పఠనం గావించగా, ఉగాది విశిష్టతను ఆనంది మోహన్ విశదీకరించారు. వేడుకల సందర్భం గా కాటన్ శారీస్, మెటీరియల్స్, గృహోపకరణాలు, ఫ్యాన్సీ జ్యువెలరీ, పచ్చళ్ల తదితరాల ప్రదర్శన, విక్రయాలకు విశేష స్పందన లభించింది.

రంజాన్ వేళలు

ఆదివారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.28
సోమవారం : సహర్ : ఉదయం - 4.20



సమాచార ధ్వని

పోలింగ్ రోజున సెలవు

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: రాష్ట్రంలో పోలింగ్ రోజున భవన నిర్మాణ కార్మికులు సహా అన్ని అసంఘటిత కార్మికులకు సెలవు ఇవ్వాలని కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్ అతుల్‌ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికలు ఈనెల 19వ తేది జరగనున్నాయి. రాష్ట్రంలో ఉన్న వాణిజ్య సంస్థల్లో పనిచేసే వారి నుంచి ఒప్పంద కార్మికుల వరకు ఓటు హక్కు విని యోగించేలా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై నెం.94445398801, 044-24335107లలో ఫిర్యాదు చేయాలని కమిషనర్ పేర్కొన్నారు.

నాలుగు రోజులు మద్యం విక్రయాలపై నిషేధం

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో నాలుగు రోజులు మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ నిషేధం విధించింది. ఎన్నికల ప్రచారం ఈ నెల 17వ తేది సాయంత్రంతో ముగుస్తుంది. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 19వ తేది అర్ధ రాత్రి 12 గంటల వరకు, ఓట్ల లెక్కింపు రోజైన జూన్ 4వ తేది మద్యం విక్రయాలపై నిషేధం విధించారు.

పూర్తైన చెన్నై - కన్నియాకుమారి డబ్లింగ్ పనులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: చెన్నై - కన్నియాకుమారి డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. 1998లో ప్రారంభమైన తొలివిడత పనులు మదురై వరకు పూర్తయ్యాయి. రెండో విడత మదురై - తిరునల్వేలి - నాగర్‌కోయిల్ - కన్నియాకుమారి మధ్య డబ్లింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు శుక్రవారం పూర్తయ్యాయని, త్వరలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. డబ్లింగ్ పనుల కారణంగా ప్రయాణ సమయం 45 నిమిషాలు ఆదా అవుతుందని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు.

కొత్త విద్యార్థులకు సమన్వయ శిక్షణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: కొత్త విద్యా సంవత్సరంలో చేరే విద్యార్థులకు తప్పనిసరిగా సమన్వయ శిక్షణ ఇవ్వాలని కళాశాలలకు యూజీసీ ఉత్తర్వులుజారీ చేసింది. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత విద్యాసంస్థల్లో చేరేటప్పుడు వారి బోధనా విధానాల్లో మార్పుల కారణంగా ఇబ్బంది పడుతుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త విద్యార్థులకు విశ్వవిద్యాలయాలు, కళాశాలలు శిక్షణ ఇవ్వాలని యూజీసీ ఉత్తర్వులు జారీ చేసింది.

10న శ్రీరామనవమి ఉత్సవాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: స్థానిక నంగనల్లూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 10వ తేది ఉదయం 10 గంటలకు శ్రీరామనవమి ఉత్సవాలు జరగనున్నాయి. యాగశాల పూజ, లక్షార్చన నిర్వహించనున్నారు. 12న సీతారాముల కల్యాణం, 14న కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ, అభిషేకం నిర్వహించనున్నారు. 18వ తేది రాత్రి 7 గంటలకు స్వామివారి ఊరేగింపు జరగనుంది.

9న పనిచేయనున్న వండలూరు పార్కు

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: స్థానిక వండలూరు జులాజికల్ పార్కు సెలవు దినమైన ఈ నెల 9వ తేది పని చేయనుంది. పనివేళల్లో తక్కువ సంఖ్యలో, సెలవు రోజుల్లో ఎక్కువ సంఖ్యలో ఈ పార్కును సందర్శిస్తున్నారు. పార్కు పర్యవేక్షణ పనుల కారణంగా ప్రతి మంగళవారం సెలవు. కాగా, ఈ మంగళవారం ఉగాది సందర్భంగా సందర్శకులను అనుమతించనున్నామని జూ అధికారులు తెలిపారు.

చెన్నై ఐఐటీలో ఉద్యోగ అవకాశాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: చెన్నై ఐఐటీలో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన వారు ఈ నెల 24వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్ పోస్టులకు బీఈలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, బీటెక్ చేసి 32 ఏళ్లలో వున్న వారు రూ.500 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీలు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర వివరాలకు www.recruit.iitm.ac.inలో చూడవచ్చు.

పోలింగ్ బూత్ ఉద్యోగులకు నేడు రెండో విడత శిక్షణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ బూత్ ఉద్యోగులకు రెండో విడత శిక్షణ ఆదివారం జరగనుంది. ఇదివరకే తొలివిడత శిక్షణ పూర్తికాగా, రెండవ విడత శిక్షణ ఎన్నికల కమిషన్ ఇవ్వనుంది. లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ ఏర్పాట్లు విస్తృతంగా జరుగుతున్నాయి. పోలింగ్ బూత్‌లకు కావాల్సిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు సిద్ధంగా ఉంచారు. సుమారు 3 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోలింగ్ బూత్‌ల్లో విధులు నిర్వహించనున్నారు. వీరికి తొలివిడత శిక్షణ మార్చి 24న జరుగ్గా, రెండో విడత శిక్షణ ఈనెల 7న ఆదివారం జరగనుంది. ఈ శిక్షణలో తపాలా ఓట్లు అందజేయనున్నారు. మూడో విడత శిక్షణలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తపాలా ఓట్లు నమోదు చేస్తారు. వీటిని సంబంధించిన బ్యాలెట్ బాక్సులను శిక్షణ తరగతులు జరిగే ప్రదేశాల్లో అందుబాటులో ఉంచుతారు. పోలింగ్‌కు ఈనెల 18వ తేది మూడో విడత శిక్షణ ఇవ్వనున్నారు.

శ్రీరామనవమి సందర్భంగా యాత్రకు అనుమతించాలంటూ పిటిషన్

పెరంబూర్, ఏప్రిల్ 6: శ్రీరామనవమి సందర్భంగా చేపట్టనున్న యాత్రకు అనుమతించాలనే పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు పోలీసు శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీ అంజనేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లో... శ్రీరామనవమి సందర్భంగా కేరళ రాష్ట్రం మలపురం నుంచి ఈనెల 12న బయల్దేరే యాత్ర 17వ తేది కన్నియాకుమారి జిల్లా వరకు చేపట్టనున్నామని, శాంతిభద్రతలు కారణం చూపి పోలీసులు అనుమతి నిరాకరించారని ట్రస్ట్ నిర్వాహకులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

30లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ: జీసీసీ

పెరంబూర్, ఏప్రిల్ 6: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో ఈనెల 30వ తేదిలోపు ఆస్తి పన్ను చెల్లింపులపై 5 శాతం రాయితీ కల్పించనున్నారు. నగరంలోని 13.31 లక్షల ఆస్తుల యజమానుల నుంచి యేటా రెండు విడతల్లో రూ.1,700 కోట్లు పన్ను రూపంలో వసూలవుతోంది. యజమానులు ఏప్రిల్ 30వ తేది లోపు తొలి అర్ధవార్షికం, అక్టోబరు 30వ తేదిలోపు రెండో అర్ధవార్షికం ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. నిర్ణీత సమయానికి పన్ను చెల్లించే వారిని ప్రోత్సహించేలా 5 శాతం రాయితీ చొప్పున గరిష్ఠంగా రూ.5 వేల వరకు రాయితీ పొందే అవకాశం కల్పించారు. ఆపై చెల్లించే వారి నుంచి 1 శాతం వడ్డీ వసూలు చేస్తుంటారు. గత ఆర్థిక సంవత్సరం రూ.1,700 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యం కాగా, రూ.1,800 కోట్లు పన్ను వసూలైనట్లు కార్పొరేషన్ తెలియజేసింది.




సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

తిరుత్తణిలో విసనకర్రల తయారీ ప్రారంభం

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: తిరుత్తణిలో విసనకర్రల తయారీ పనులు ప్రారంభమయ్యాయి. చెన్నై, తిరుత్తణి వంటి ప్రాంతాల్లో ఎండ తీవ్రత 100 డిగ్రీల ఫారన్‌హీట్ పైగా నమోదవుతోంది. ఎండలు మరింత పెరిగే అవకాశమున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు పుచ్చకాయలు, శీతలపానీయాల విక్రయాలు పెరిగాయి. తిరుత్తణి చుట్టుపక్కల ప్రాంతాల్లో కొండలు ఉండడంతో ఎండలు మండిపోతున్నాయి. అప్పుడప్పుడు కరెంటు కోతల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయాల్లో చల్లటి గాలినిచ్చే విసనకర్రలు వినియోగించడం ప్రారంభించారు. ప్రజల అవసరాలు గుర్తించిన విసనకర్ర తయారీదారులు వాటి తయారీ పనులు ముమ్మరంగా చేశారు. ముఖ్యంగా, తిరుత్తణి యూనియన్ సిరుగుమి పంచాయతీ పరిధిలోని వీసీఆర్ కండిగైలో ఎక్కువగా ఈ వృత్తిని చేపడుతున్నారు. సుమారు 100 కుటుంబాలకు పైగా విసనకర్రలు తయారుచేసి, జత రూ.60కి విక్రయిస్తున్నారు. వీటిని తిరువళ్లూర్, చెన్నై, కాంచీపురం తదితర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు.



విసనకర్రల తయారీలో మహిళ

ప్రజలే ముఖ్యం

- అందుకే బీజేపీ కూటమి నుంచి వైదొలిగాం
- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్

పెరంబూర్, ఏప్రిల్ 6: అధికారం తమకు ముఖ్యం కాదని, ప్రజలు ముఖ్యం కాబట్టే బీజేపీ కూటమి నుంచి వైదొలిగామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి స్పష్టం చేశారు. తిరుచ్చి అన్నాడీఎంకే అభ్యర్థి కరుప్పయ్యకు మద్దతుగా శనివారం జరిగిన బహిరంగసభలో ఈపీఎస్ మాట్లాడుతూ... అన్నాడీఎంకే పాలనలో రాష్ట్ర ప్రజలు స్వర్ణయుగాన్ని చూశారన్నారు. డీఎంకే మూడేళ్ల పాలన చీకటి పాలనగా ప్రజలు భావిస్తున్నారన్నారు. మూడేళ్లలో 3.5 లక్షల కోట్ల అప్పులు మాత్రమే వారు తీసుకొచ్చారన్నారు. ప్రజలకు ఏం చేశారని, కేంద్రం అధికారంలోకి రావాలనే కోరికతో కాంగ్రెస్, బీజేపీకి మార్చి మార్చి మద్దతు పలికిన చరిత్ర డీఎంకేకు ఉందన్నారు. బీజేపీ కూటమి నుంచి అన్నాడీఎంకే వైదొలగడం స్టాలిన్‌ను ఓర్వలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాభిమానం కోల్పోయిన స్టాలిన్, 'ఇండియా' కూటమి అంటూ ఎన్నికలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. డీఎంకేతో జతకట్టి అన్నాడీఎంకే గుర్తును స్తంభింపజేయాలని పలువురు యత్నించారని, కానీ అవి ఫలించలేదన్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో తాము విజయం సాధిస్తామని పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు.



బహిరంగ సభలో ప్రజలకు ఈపీఎస్ అభివాదం

'తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం' ఆధ్వర్యంలో

తెలుగు ఉగాది వేడుకలు

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న సాయంత్రం 5 గంటలకు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరగనున్నాయి. పెరంబూరులోని డీఆర్ బీసీసీసీ మహోన్నత పాఠశాలలో జరగనున్న ఈ వేడుకలకు సంస్థ అధ్యక్షుడు తమ్మినేని బాబు అధ్యక్షత వహించనుండగా, దక్షిణ రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ బి.విశ్వనాథ్ ఈర్య ముఖ్య అతిథిగా, సింహాద్రి కన్‌స్ట్రక్షన్స్ అధినేత వెలం శ్రీనివాసులు విశిష్ట అతిథిగా, పారిశ్రామికవేత్త నర్రావుల వెంకటరమణ ఆత్మీయ అతిథిగా హాజరుకానున్నారు. కార్యక్రమంలో భాగంగా అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతం ఆలపించనుండగా, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ టీఆర్ఎస్ శర్మ పంచాంగ పఠనం చేయనున్నారు. శ్రీదేవి నాట్యాలయ ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన ఉంటుంది. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేడు 'శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్' ఆధ్వర్యంలో

ఉగాది పురస్కారాల ప్రదానం

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): 'శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్' ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరగనున్న ఈ వేడుకలకు తెలంగాణ ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా, ప్రముఖ గాయని పి.సుశీల, ఎస్‌బీఐ చెన్నై సర్కిల్ జీఎం ఎంవీఆర్ మురళీకృష్ణ, తానా ఫౌండేషన్ ఛైర్మన్ శశికాంత్ వల్లేపల్లి, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు. రాయపేట, టీటీకే రోడ్డులోఉన్న మ్యూజిక్ అకాడమీలో సాయంత్రం 4.29 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకల్లో కళాసుధ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ స్వాగతోపన్యాసం చేయనున్నారు. మాధవపెద్ది సురేష్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం' పురస్కారం, శ్రేయ రామనాథ్‌కు 'లతా మంగేష్కర్' పురస్కారం, కాసర్ల శ్యామ్‌కు 'సిరివెన్నెల సీతారామ శాస్త్రి' పురస్కారం ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా కావ్య కల్యాణ్‌రాంకు 'బాపూ బొమ్మ పురస్కారం', సినీ దర్శకుడు మహేష్‌బాబుకి 'బాపూరమణల పురస్కారం', పారిశ్రామికవేత్త పద్మ దేవదాస్‌కు 'మహిళా రత్న పురస్కారం' ప్రదానం చేయనున్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రతి కుటుంబానికి ఒక వెండి నాణేన్ని బహూకరించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మద్యం తాగి పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం సస్పెన్షన్

పెరంబూర్, ఏప్రిల్ 6: ధర్మపురి జిల్లాలో మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. ధర్మపురి యూనియన్ మారవాడి పంచాయతీ మాధ్యమిక పాఠశాలలో గుణశేఖరన్(57) ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇటీవల జిల్లా విద్యాధికారి (పాఠశాల విద్య) మాన్‌విళి ఆ పాఠశాల పరిశీలనకు వెళ్లారు. ఆ సమయంలో హెచ్‌ఎం గుణశేఖరన్ మద్యం తాగి ఉన్నట్లు గుర్తించి, వెంటనే వైద్య పరీక్షలకు పంపించారు. గుణశేఖరన్ తరచూ మద్యం తాగి పాఠశాలకు వస్తున్నట్లు విచారణ తేలింది. దీంతో, హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తున్నట్లు మాన్‌విళి ఉత్తర్వులు జారీచేశారు.

జూన్ 19 నుంచి కళాశాలలు ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 6: వేసవి సెలవుల అనంతరం కళాశాలలు జూన్ 19వ తేది నుంచి ప్రారంభమవుతాయని కళాశాల విద్య డైరెక్టరేట్ తెలిపింది. ప్రస్తుత విద్యా సంవత్సరం (2023-24) యూజీసీ నిర్ణయించిన పని దినాలు పూర్తి చేసిన కళాశాలలు ఆదివారంలోగా ఆ వివరాలను పంపాలని కళాశాల విద్య డైరెక్టర్ ఎస్.కార్మేగం కోరారు. ఆ ప్రకారం, వేసవి సెలవుల అనంతరం జూన్ 19వ తేది నుంచి కళాశాలలు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు.

మేల్‌మలయనూరు ఆలయ హుండీ ఆదాయం రూ. కోటి

పెరంబూర్, ఏప్రిల్ 6: విల్లుపురం జిల్లాలో ప్రసిద్ధిచెందిన మేల్‌మలయనూరు అంకాళమ్మన్ ఆలయ హుండీ ఆదాయం కోటి రూపాయలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆలయానికి ప్రతిరోజు వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని పూజిస్తుంటారు. అలాగే, అమావాస్య రోజున నిర్వహించే ఊంజల్ సేవలో లక్షమందికి పైగా పాల్గొంటుంటారు. అలా వచ్చిన భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు శుక్రవారం జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు రూ.1,05,59,805 నగదు, 408 గ్రాముల బంగారం, 1,412 గ్రాముల వెండిని కానుకలుగా సమర్పించినట్లు ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు సురేష్ తెలిపారు.

12నుంచి మదురై మీనాక్షి ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు



చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ఈనెల 12 నుంచి చిత్తిరై ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. పదిరోజులపాటు నిర్వహించే ఈ వేడుకల్లో ఈనెల 19 రాత్రి మీనాక్షి అమ్మవారి పట్టాభిషేకం, 21న మీనాక్షి సుందరేశ్వరర్ తిరుకల్యాణోత్సవం కనుల పండువగా జరగనున్నాయి. ప్రతిరోజూ స్వామిఅమ్మవార్లు స్వర్ణ చప్పరం, భూత, కల్పవృక్ష, కైలాస పర్వత, కామధేను తదితర వాహనాల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు.

భగ్గుమన్న భానుడు

- చెన్నైలో 40 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రతలు
- 15 ప్రాంతాల్లో పెరిగిన ఎండ తీవ్రత

పెరంబూర్, ఏప్రిల్ 6: ఈ ఏడాది తొలిసారి రాజధాని నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా నమోదయ్యాయి. మీనంబాక్కం విమానాశ్రయంలో శనివారం 39.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక, రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సేలంలో అత్యధికంగా 41.6 డిగ్రీల సెల్సియస్‌కు చేరింది. అలాగే, తిరుపత్తూర్, పరమత్తివేలూరులో 41.6, వేలూరు, తిరుచ్చి, ధర్మపురి, ఈరోడ్‌లో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో మూడు రోజులు పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియ జేసింది.

ఊటీలో గుర్రపు పందేలు ప్రారంభం



ఐసిఎఫ్, ఏప్రిల్ 6: ఊటీ రేస్‌కోర్స్ మైదానంలో గుర్రపు పందేలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలో 25 మంది జాకీలు, 16 మంది కోచ్‌లు పాల్గొన్నారు. వేసవి సీజన్ ప్రారంభం కావడంతో నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ పార్కులో పూల ప్రదర్శన సహా వివిధ కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా రేస్ కోర్స్ మైదానంలో 500కు పైగా గుర్రాలతో పందేలు ప్రారంభమయ్యాయి. జూన్ 2వ తేది వరకు పందేలు నిర్వహించనున్నారు.

ముగిసిన ఎస్.కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసాలు

అడయార్, ఏప్రిల్ 6: సాయి విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో ఎస్. కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసాలు శుక్రవారం ముగిశాయి. ఈ సిరీస్‌లో భాగంగా రెండో ప్రసంగాన్ని ప్రముఖ సీనియర్ న్యాయవాది శ్రీరామ్ పంచు 'డాక్ట్రిన్ ఆఫ్ జ్యుడిషియల్ రివ్యూ అండ్ చీఫ్ జస్టిస్ జాన్ మార్షల్' అనే అంశంపై ప్రసంగించారు. న్యాయపరమైన సమస్యలపై విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించడానికి, చట్టపరమైన సోదరభావం, ప్రజలతో మమేకం కావడానికి దోహదపడేలా ఈ ధర్మనిధి ఉపన్యాసాలను స్కూల్ ఆఫ్ లా నిర్వహించింది. ముఖ్యంగా శ్రీరామ్ పంచు తన ప్రసంగంలో న్యాయ సమీక్ష ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, రాజ్యాంగం పరిరక్షణ, న్యాయస్థానాన్ని స్థాపించడంలో జాన్ మార్షల్ కీలక పాత్రను పోషించారని గుర్తు చేశారు. ఆళ్వార్‌పేటలోని మ్యూజిక్ అకాడమీలో జరిగిన ఈ వేడుకలో యూనివర్శిటీ నిర్వాహకులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఫుడ్ కోర్టు ప్రారంభం

వేలూరు, ఏప్రిల్ 6: స్థానిక సత్తువాచ్చేరి సమీపం డబుల్ రోడ్డులో శనివారం భూమిస్ ఫుడ్ కోర్టు హోటల్ 3వ శాఖను వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం ప్రారంభించారు. కార్యక్రమంలో హోటల్ యజమాని భూమినాథన్ జగదీశ్వర్, పట్టణ ప్రముఖులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



ఫుడ్ కోర్టు ప్రారంభిస్తున్న వీఐటీ ఉపాధ్యక్షుడు సెల్వం

వైద్యవిద్యలో ప్రతిభాపాటవాలు పెంపొందించుకోవాలి

- ఎన్బీఈఎమ్మెస్ సదస్సులో వక్తలు

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిభా పాటవాలను పెంపొందించుకోవాలని అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్బీఈఎమ్మెస్) సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. ఈ సదస్సును అపోలో హాస్పిటల్స్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ మధు శశిధర్ ప్రారంభించారు. ఎన్బీఈఎమ్మెస్ అధ్యక్షుడు డాక్టర్ అభిజిత్ సేత్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ మిను బాజ్‌పాయి, అపోలో నాలెడ్జ్ సీఈఓ శివరామకృష్ణన్ వెంకటేశ్వరన్, అపోలో హాస్పిటల్స్ గ్రూపు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న అపోలో హాస్పిటల్స్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ మధు శశిధర్

11 కిలోల గంజాయి స్వాధీనం

వేలూరు, ఏప్రిల్ 6: తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపంలో శనివారం ఉదయం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడిని అడ్డుకొని తనిఖీ చేయగా, 11 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. యువకుడిని విచారిస్తున్నారు.

నీటమునిగి ముగ్గురి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 6: తిరుప్పూర్ జిల్లా పొంగలూరు సమీపం పరంబికులం అజియారు పంట కాలువలో స్నానానికి దిగిన ముగ్గురు గల్లంతయ్యారు. వీరిలో వీణ (18), ప్రీత (17) అనే బాలికల మృతదేహాలు తీరానికి కొట్టుకురాగా, గల్లంతైన సంతోష్ కోసం గాలిస్తున్నారు. శుక్రవారం స్నానాలకు దిగి గల్లంతైన వీరు శనివారం ఉదయం శవాలుగా తేలారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలల విద్యార్థులకు 2 నెలలు వేసవి సెలవులు

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు అధికంగా ఉండటంతో ఈ యేడాది పాఠశాలల విద్యార్థులకు రెండు నెలలపాటు వేసవి సెలవులు ప్రకటించేందుకు పాఠశాలల విద్యాశాఖ ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో ప్లస్-2 పబ్లిక్ పరీక్షలు ముగిసి, టెన్త్ పబ్లిక్ పరీక్షలు గత మార్చి 24న ప్రారంభమై ఈ నెల 8న ముగియనున్నాయి. ఈ నెల తొమ్మిది నుంచి ప్రభుత్వ పాఠశాలలన్నీ మూతపడనున్నాయి. రెండు మాసాల వేసవి సెలవుల తర్వాతే మళ్లీ పునః ప్రారంభమవుతాయి.

ఒకే విడత ఎన్నికలకు ఒకటిన్నర సంవత్సరం పడుతుందేమో!

- మంత్రి పళనివేల్ త్యాగరాజన్

పెరంబూర్, ఏప్రిల్ 6: ఒకే విడత ఎన్నికల నిర్వహణకు ఒకటిన్నర సంవత్సరం పడుతుందేమోనని రాష్ట్ర మంత్రి పళనిస్వామి త్యాగరాజన్ ఎద్దేవా చేశారు. 2004లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు 20 రోజుల్లో ముగిశాయని, 20 ఏళ్ల అనంతరం ఈ ఏడాది ఎన్నికల నిర్వహణకు మూడు నెలలు పట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇది ఎన్నికల సంఘం అసమర్థను తెలియజేస్తోందన్నారు. ఇక ఒకే దేశం... ఒకే ఎన్నిక నిర్వహణకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం 542 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిపేందుకు మూడు నెలలు పడుతుండగా, దేశవ్యాప్తంగా ఒకే విడత ఎన్నికలు అంటే ఒకటిన్నర సంవత్సరం పడుతుందేమోనని మంత్రి ఎద్దేవా వ్యక్తం చేశారు.

అన్నాడీఎంకేకు మద్దతుగా 9 నుంచి కార్తీక్ ప్రచారం

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థులకు మద్దతుగా మనిద ఉరిమైగళ్ కాక్కుం కట్చి నాయకుడు, సినీ నటుడు కార్తీక్ ఈనెల 9 నుంచి ప్రచారం చేయనున్నారు. 9న మదురై, 10న దిండుగల్, 11న తేని, 13న శివగంగ, 14న తిరునల్వేలి, 15న విరుదునగర్, 16న తిరుచ్చి, 17న కోయంబత్తూరు నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తారు. ఆ మేరకు అన్నాడీఎంకే అధిష్ఠానం శనివారం ఉదయం ఓ ప్రకటన జారీ చేసింది.

ప్రధాని మోదీ సభకు భారీ ఏర్పాట్లు

వేలూరు, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 10వ తేది ప్రధాని నరేంద్ర మోదీ వేలూరుకు రానున్నారు. కోట మైదానంలో జరగనున్న బహిరంగ సభలో బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. ఈ క్రమంలో, ప్రధాని పాల్గొనే వేదిక ఏర్పాటు పనులకు సంబంధించిన భూమి పూజ శనివారం జరిగింది. వేలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏసీషణ్ముగం సహా పలువురు నేతలు పాల్గొన్నారు.



వేదిక ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

'నీట్' కాంగ్రెస్ పుణ్యమే : నటి ఖుష్బూ

వేలూరు, ఏప్రిల్ 6: 'నీట్' కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కార్యరూపం దాల్చిందని, ప్రస్తుతం ఆ పరీక్ష రద్దు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ నేత, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ అన్నారు. ఆమె శనివారం వేలూరు లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి ఏసీ షణ్ముగంతో కలసి విలేకరులతో మాట్లాడుతూ... కచ్చాదీవి శ్రీలంకకు అప్పగించింది కాంగ్రెస్ - డీఎంకే కూటమి అన్నారు. ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్.. డీఎంకే స్పీకర్‌గా మారారని ఎద్దేవా చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఖుష్బూ

అన్నాడీఎంకే అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

వేలూరు, ఏప్రిల్ 6: అరక్కోణం లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థికి మద్దతుగా వేలూరు మా నగర పార్టీ సెక్రటరీ ఎస్సార్కే అప్పు నేతృత్వంలో కాట్పాడి శాసన సభ నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మపురంలో ఇంటింటి ప్రచారం చేపట్టి 'రెండాకులు' గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో అన్నా కార్మికుల సంఘం నేత బెల్ తమిళ్‌అరసన్, కాట్పాడి యూనియన్ సెక్రటరీ సుభాష్, వంద్రన్‌తాంగల్ పంచాయతీ అధ్యక్షుడు రాకేష్, బ్రహ్మపురం పంచాయతీ మాజీ అధ్యక్షుడు పుగల్‌వేందన్, అసంఘటిత డ్రైవర్ల సంఘ కార్యదర్శి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో ఎస్సార్కే అప్పు, నేతలు

అన్నాడీఎంకే ప్రచార వాహనం ప్రారంభం

వేలూరు, ఏప్రిల్ 6: వేలూరు లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి డాక్టర్ పసుపతికి మద్దతుగా ఆ పార్టీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రభుత్వ హయాంలో అమలుచేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఎల్ఈడీ స్క్రీన్‌తో ప్రచార వాహనాన్ని సిద్ధం చేశారు. ఈ వాహనాన్ని వేలూరు మండల ఐటీ వింగ్ సెక్రటరీ జననీ సతీష్‌కుమార్ నేతృత్వంలో తిరుపత్తూర్ జిల్లా సెక్రటరీ వీరమణి, వేలూరు మానగర జిల్లా సెక్రటరీ ఎస్సార్కే అప్పు తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో రాము, మూర్తి, రాజన్ సహా పలువురు పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న వీరమణి

మనిదనేయ మక్కల్ కట్చి కార్యాలయం ప్రారంభం

వేలూరు, ఏప్రిల్ 6: పేర్నాంబట్టులో తమిళనాడు ముస్లిం మున్నేట్ర కళగం, మనిదనేయ మక్కల్ కట్చి నగర కార్యాలయం ప్రారంభించారు. కార్యక్రమానికి నగర అధ్యక్షుడు అబ్దుల్ సమద్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మనిదనేయ మక్కల్ కట్చి రాష్ట్ర అధ్యక్షుడు, లెక్చరర్ జవాహిరుల్లా పాల్గొని, రిబ్బన్ కత్తిరించి కార్యాలయం ప్రారంభించారు. పార్టీ నాయకులు ఏఎస్ అహ్మద్, పీఎంకే జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్, అతీయ సుల్తాన్, మహ్మద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జవాహిరుల్లా

రాష్ట్రంలో బీజేపీకి డిపాజిట్లు గల్లంతే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న బాలకృష్ణన్ తదితరులు

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలకు రాష్ట్రంలో డిపాజిట్లు దక్కవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ అన్నారు. టి.నగర్‌లోని కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి. రామకృష్ణన్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్న సభలో బాలకృష్ణన్ మాట్లాడుతూ... కార్మికులకు నెలకు రూ.26వేల చొప్పున కనీసవేతనం చెల్లించాలని, ప్రజా పంపిణీ పథకం ద్వారా ఒక వ్యక్తికి ఐదు కిలోలు ఉచితంగాను, ఐదు కిలోలో సబ్సిడీతో ఆహార ధాన్యాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తమ కూటమి అధికారంలోకి వస్తే జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేస్తామని, పార్లమెంట్‌లో, అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని, ఉరిశిక్ష రద్దుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో హిందీ, సంస్కృత భాషలను నిర్బంధంగా అమలు చేయకూడదని, చెన్నైలో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



వేలూరు నియోజకవర్గ పరిధిలోని ఆనైకట్టు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఊసూరు, పుదూర్ తదితర గ్రామాల్లో శనివారం ఓట్లు అభ్యర్థిస్తున్న డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్





నీట్‌పై ఇంకెంత కాలం ఈ నాటకాలు?

● నటి గాయత్రి

● ఏం అడిగారండీ

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నీట్ రద్దు చేసే యుక్తి తమకు మాత్రమే తెలుసునని, ఎన్నికల్లో గెలిపిస్తే రద్దు చేస్తామంటూ డీఎంకే కూటమి పార్టీలు కపటనాటకాలాడుతున్నాయని అన్నాడీఎంకే మహిళా విభాగ డిప్యూటీ కార్యదర్శి గాయత్రి రఘురాం మండిపడ్డారు. రాష్ట్రంలోని గృహిణులందరికీ ప్రతి నెలా రూ.1000ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అర్హులైనవారికే అంటూ మెలిక పెట్టి డీఎంకే ప్రభుత్వం గృహిణులను మోసగించిందన్నారు. తేని జిల్లా ఎంజీఆర్, జయలలితను రాష్ట్ర ముఖ్యమంత్రులుగా చేసిందని, ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న వీటీ నారాయణస్వామి ఈ ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

● పాపం ఎంత కష్టమో

నా గెలుపును అడ్డుకుంటున్నారు!

● వీరప్పన్ కుమార్తె



చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి నియోజకవర్గంలో తన గెలుపును అడ్డుకునేందుకు ప్రత్యర్థులు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారని, బెదరింపులకు పాల్పడుతున్నారని ఆ నియోజకవర్గం నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి, గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి వీరప్పన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి సరయూకు ఓ వినతిపత్రం సమర్పించారు. తన కోసం ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులను ఓ స్వతంత్ర అభ్యర్థి బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నిరంతరం తన వాహనం వెనుకే ఫాలో అవుతున్నారని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా పోలీసులు తనపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని వాపోయారు. ఈ వివరాలతో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఆమె చెప్పారు.



కన్నీళ్లు తుడుచుకుంటున్న జ్యోతిమణి

● సెంటిమెంట్

స్వస్థలంలో జ్యోతిమణి కన్నీళ్లు!

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కరూరు లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న జ్యోతిమణి తన స్వస్థలంలో ప్రచారం చేస్తూ కంటతడిపెట్టుకున్నారు. జ్యోతిమణి స్వస్థలం పెరియతిరుమంగళంలో శుక్రవారం రాత్రి ఆమె ఓపెన్ టాప్ వ్యాన్‌పై నిలిచి ప్రచారం చేస్తూ నాలుగేళ్ల తొమ్మిది నెలల 24 రోజులపాటు ఎంపీగా నియోజకవర్గం ప్రజలకు సేవలందించానని, చాలా సందర్భాల్లో రాత్రిపూటే తన స్వస్థలానికి వచ్చేదానినని, తన అమ్మ బతికుంటే పనిభారం కాస్త తగ్గేదని చెబుతూ కంటతడి పెట్టుకున్నారు. తన కష్టసుఖాల్లో స్థానిక ప్రజలే కుటుంబసభ్యుల్లా తనకు అండగా ఉంటున్నారని, వారందరికీ ధన్యవాదాలని చెప్పి అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు.



విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ తరుపున పోటీ చేస్తున్న నటి రాధిక తన ప్రచారంలో చిన్నారిని ఎత్తుకొని ఫొటోలకు ఫోజులిస్తున్న దృశ్యం



తిరుచ్చి లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి కరుప్పయ్య కూలీలతో కలిసి నాట్లు వేస్తున్న దృశ్యం



విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో తపాలా ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగుడు

● ప్రచారంలో పదనిసలు

తేనిలో పాగా వేసేదెవరో?

● వీఐపీ నియోజకవర్గం

ప్యారీస్, ఏప్రిల్ 6: యాలకుల సువాసనలు వెదజల్లుతున్న లోక్‌సభ నియోజకవర్గం తేని. పంటలు పుష్కలంగా పండే నేలతల్లి ఒకవైపు, మరోవైపు కరువుతో వెనుకబడిన ప్రాంతాల కలయికతో కూడిన స్థానం. 2008లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తేని లోక్‌సభ నియోజకవర్గం ఆవిర్భవించింది. ఈ నియోజకవర్గంలో తేని జిల్లాలోని ఆండిపట్టి, పెరియకుళం (రిజర్వుడు), బోడి, కంభం, మదురై జిల్లాలోని ఉసిలంపట్టి, చోళవందాన్ (రిజర్వుడు) తదితర ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిలో గత శాసనసభ ఎన్నికల్లో చోళవందాన్, ఆండిపట్టి, పెరియకుళం, కంభం స్థానాల్లో డీఎంకే విజయం సాధించగా, ఉసిలంపట్టి, బోడినాయకనూర్‌లు అన్నాడీఎంకే వశమయ్యాయి.

పెరియకుళం పేరుతో...

తేని పార్లమెంటు నియోజకవర్గం అందుబాటులోకి వచ్చే వరకు పెరియకుళం పేరుతో ఉండేది. 1952వ సంవత్సరం నుంచి 2004 వరకు 14 జనరల్ ఎన్నికలు, ఉపఎన్నిక జరిగాయి. ఇందులో అన్నాడీఎంకే ఉపఎన్నిక సహా ఏడు సార్లు ఘనవిజయం సాధించింది. ఇక కాంగ్రెస్ నాలుగు సార్లు, డీఎంకే రెండు సార్లు, జస్టిస్ పార్టీ, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ తలా ఒకసారి గెలిచాయి. తేని లోక్‌సభ నియోజకవర్గంగా ఉదయించిన తరువాత మూడుసార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 2009 నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన జీఎం హరూన్ రషీద్ గెలిచారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే వరుసగా గెలిచింది. 2014లో డీఎంకే అభ్యర్థి పొన్ ముత్తురామలింగంను ఓడించి 3,14,532 ఓట్ల మెజార్టీతో అన్నాడీఎంకే అభ్యర్థి ఆర్.పార్తిబన్ రికార్డు స్థాయి విజయం సాధించారు.



తంగ తమిళ్‌సెల్వన్ (డీఎంకే)

2019లో ఒకే స్థానంలో గెలిచిన అన్నాడీఎంకే...

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి పార్టీలు తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 నియోజకవర్గాల్లో పోటీ చేసి 39 స్థానాల్లో ఘోరపరాజయం చవిచూడగా, ఆ పార్టీ గెలిచిన ఒకే ఒక స్థానం తేని. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం కుమారుడు రవీంద్రనాథ్ విజయం సాధించి తొలిసారి పార్లమెంటుకు వెళ్లారు.


మొత్తం ఓటర్లు: 16,20,410, పురుషులు: 7,95,909, మహిళలు: 8,24,292, ఇతరులు: 218

సామాజిక వర్గాలు...

తేని నియోజకవర్గంలో ముక్కులత్తూర్ వర్గానికి చెందిన వారు 27 శాతం, ఎస్సీలు 20 శాతం, గౌండర్లు 8 శాతం, నాయుడు వర్గం 8 శాతం, పిళ్లైయార్ 7 శాతం, చెట్టియార్లు 6 శాతం, నాడార్లు 4 శాతం, ముస్లింలు 4 శాతం, క్రైస్తవులు 2 శాతం, ఇతర సామాజిక వర్గాల వారు 14 శాతం ఉన్నారు.

ప్రధాన సమస్యలు...

దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత బోడి ఎమ్మెల్యేగా, శాసనసభ ప్రతిపక్షనేతగా 1989లో వ్యవహరించిన రోజుల్లో కురంగణి-టాప్ స్టేషన్ల మధ్య తన నియోజకవర్గ అభివృద్ధి నిధులతో కొండ మార్గం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఈ పథకం అమలుకు నోచు కోలేదు. అదే తరహాలో సాక్కులూత్త మేట్టు రహదారి, బోడి - అగమలై కొండ మార్గం పథకాలు ఇప్పటికి అమలు కాలేదని స్థానికులు వాపోతున్నారు. ఆండిపట్టి నియోజకవర్గంలో కరువును పారదోలేందుకు నీటి వనరులను మెరుగుపరచాలని ఎంజీఆర్ ప్రభుత్వ హయాంలో మావూత్రు ఆలయం సమీపంలో తిప్పరేవు డ్యాం నిర్మాణానికి, ములవైగై ప్రాంతంలో ఆనకట్ట నిర్మించేందుకు పథకం సిద్ధం చేశారు. అయితే ఈ ప్రాజెక్టులు ఫైళ్లకే పరిమితమయ్యాయి. నేత కార్మికుల కుటుంబాల ఆదాయాన్ని మెరుగుపరచి వారికి అండగా ఉండాలన్న సంకల్పంతో టీకన్‌బులాపురంలో విదేశీస్థాయి జౌళి పార్కు పథకాన్ని 19 ఏళ్ల క్రితం ప్రభుత్వం ప్రకటించింది. నిర్మాణపనులు పూర్తికాకుండానే ఆ పథకం అటకెక్కింది.



వీటీ నారాయణస్వామి (అన్నాడీఎంకే)



టీటీవీ దినకరన్ (ఏఎంఎంకే)

ఉద్యోగావకాశాలు...

బోడి, కంభం ప్రాంతాల్లో తగిన ఉద్యోగావకాశాలు లేకపోవడంతో ప్రతిరోజు సుమారు 20,000 మంది పురుషులు, మహిళలు కేరళ రాష్ట్రంలోని యాలకులు, మిరియాలు, కాఫీ తోటల్లో కూలి పనులకు వెళుతున్నారు. వీరు జీపుల్లో వెళుతూ ప్రమాదాల్లో మృత్యువాతపడడం, కాలు, చేతులు విరిగిన ఘటనలు ఉన్నాయి. ఈ సమస్య కేంద్రీయ విద్యాలయం తేనిలో ప్రారంభించేందుకు స్థలం ఎంపిక చేసి ఏళ్లు గడిచినా ఇంకా ఎలాంటి పురోగతి లేకపోయింది. ఇక, చెన్నై - బోడి మధ్య వారానికి మూడు సార్లు నడుస్తున్న రైలును ప్రతిరోజు నడిపితే విద్యార్థులకు, ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులు...

డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తంగ తమిళ్‌సెల్వన్ ఇప్పటికే ఇదే నియోజకవర్గంలో 2009లో అన్నాడీఎంకే తరఫున, 2019లో ఏఎంఎంకే తరఫున పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ప్రస్తుతం డీఎంకే అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆయన, ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని ముమ్మర ప్రచారం చేపట్టగా, ఈసారి తప్పకుండా ఈ స్థానం కైవసం చేసుకొనేలా అధికార డీఎంకే భావిస్తోంది. అలాగే, అన్నాడీఎంకే తరఫున వీటీ నారాయణస్వామి, బీజేపీ కూటమిలో ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, నామ్ తమిళర్ పార్టీ తరుపున మదన్ సహా పలువురు స్వతంత్రులు బరిలో నిలిచారు. ప్రస్తుతం ఈ స్థానంలో త్రిముఖ పోటీ ఉండగా, తేని ప్రజలు ఎవరిపై కరుణ చూపిస్తారో జూన్ 4వ తేది తెలియనుంది.

యువత కోసమే పోటీ నుంచి తప్పుకున్నా!

● యువతపై ఎంత ప్రేమో

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పార్టీలో దశాబ్దాల తరబడి సేవలందిస్తున్నవారు, యువకులు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికే తాను ఈసారి పోటీ నుంచి తప్పుకున్నట్లు అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి, మాజీ మంత్రి గోకుల ఇందిరా అన్నారు. నగరంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో డీఎంకేకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, అన్నాడీఎంకేని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మైనార్టీలంతా తమ పార్టీకే గట్టి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. రాజధాని నగరం చెన్నైలోని మూడు నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులే గెలుస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



గోకుల ఇందిరా →

భవిష్యత్తు యువతదే

● బీజేపీ నేత వినోజ్ పి.సెల్వం



యువతతో కలిసి క్రికెట్ ఆడుతున్న వినోజ్ పి.సెల్వం

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భారత భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, యువత క్రియాశీలకంగా వ్యవహరించనుందని సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం అన్నారు. శనివారం ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డీఎంకే కూటమి అజేయంగా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారని, 2014లో ఆ కూటమి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కనీస ఓట్లు కూడా సాధించలేక కుదేలైందన్నారు. సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గం కుటుంబ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమని, ఇక్కడ డీఎంకేను ఓడించగలిగితే ఆ ప్రభావం అన్ని నియోజకవర్గాలపైనా పడుతుందన్నారు. డీఎంకే నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడం అవసరమని, అందువల్ల ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తెరిగి ఓటు అనే ఆయుధాన్ని ఝుళిపించాలని పిలుపునిచ్చారు. వంతుల వారీగా రాష్ట్రాన్ని పాలిస్తున్న డీఎంకే, అన్నాడీఎంకేలను ప్రజలు తిరస్కరిస్తున్నారన్న విషయం ఈ లోక్‌సభ ఎన్నికల్లో స్పష్టమవుతుందన్నారు. దేశవ్యాప్తంగా తమ పార్టీ విజయం ఖాయమని వినోజ్ ధీమా వ్యక్తం చేశారు.

● యువర్ అటెన్షన్ ప్లీజ్



ఓటరు జాబితాలో మీ పేరుందా?

పెరంబూర్, ఏప్రిల్ 6: ఓటరు జాబితా తమ పేరు ఉందా అని తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ పరిచయం చేసింది. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితా విడుదలైంది. రాష్ట్రంలో 3.06 కోట్ల మంది పురుషులు, 3.17 కోట్ల మంది మహిళలు, 8,467 మంది ఇతరులు సహా 6.23 కోట్ల మంది ఓటర్లున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో 'బూత్ స్లిప్' పంపిణీ జరుగుతోంది. బూత్ స్లిప్ అందని వారు www.elections.tn.gov.in, voters.eci.gov.in అనే వెబ్‌సైట్లు, "voter Helpline" అనే మొబైల్ యాప్‌లో తన వివరాలను నమోదు చేసి తెలుసుకోవచ్చు.



● పొలంలో ప్రచారం

రూ.4,000 ఇస్తాం

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రామనాథపురంలో అన్నాడీఓంకే అభ్యర్థి పి. జయపెరుమాళ్... కముది ప్రాంతంలో పొలంలో పనిచేస్తున్న మహిళా కూలీలను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆ సందర్భంగా వారితో మాట్లాడుతూ అన్నాడీఎంకే మళ్లీ అధికారంలోకి వస్తే గృహిణులందరికీ రూ.4వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసే పథకాన్ని అమలు చేస్తుందన్నారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని రైతు కూలీల సమస్యలు తనకు బాగా తెలుసునని పేర్కొంటూ వారికి కరపత్రాలు పంచి పెట్టారు.

పొలంలో ప్రచారం చేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి జయపెరుమాళ్

100 శాతం పోలింగ్ ఆకాంక్షిస్తూ 1,000 దీపాలు వెలిగించిన మహిళలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 6: మహిళలు 100 శాతం పోలింగ్ ఆకాంక్షిస్తూ 1,000 దీపాలు వెలిగించి ఎన్నికల అవగాహన కల్పించారు. రాష్ట్రంలో ఈనెల 19వ తేది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. ఓటు ఆవశ్యకతపై వివిధ అవగాహన కార్యక్రమాలను ఎన్నికల కమిషన్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తంజావూరు జిల్లాలో ముగ్గులు వేయడం, క్రికెట్ పోటీలు, బెలూన్లు ఎగురవేయడం వంటి వినూత్న కార్యక్రమాలతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. శనివారం అంగన్వాడీ ఉద్యోగులు 100 శాతం పోలింగ్ ఆకాంక్షిస్తూ 1,000 దీపాలు వెలిగించి కరపత్రాలు పంపిణీ చేశారు.



ఎడప్పాడి... ఫ్యూజు లేని బల్బు

● రాధిక విమర్శలు

అడయార్, ఏప్రిల్ 6: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిపై బీజేపీ మహిళా నేత, విరుదురునగర్ లోక్‌సభ అభ్యర్థి,సినీ నటి రాధికా శరత్‌కుమార్ విమర్శల వర్షం కురిపించారు. తన విజయం కోసం ఆమె ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. విరుదునగర్‌కు, ఢిల్లీకి మధ్య వారధిగా ఉంటానని ఆమె ఓటర్లకు హామీ ఇచ్చారు. తొలిసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనను గెలిపించాలని ఆమె కోరారు. అన్నాడీఎంకే అభ్యర్థులు ఎవరిని ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తారు, ఎవరి పేరు చెప్పి ఓట్లు అడుగుతారన్నారు. ఎడప్పాడి పళనిస్వామి ఫ్యూజు లేని బల్బు వంటివారన్నారు. అన్నాడీఎంకే అభ్యర్థి గెలిచినా ఢిల్లీకి వెళ్లి ఎవరిని కలుస్తారు అంటూ ఆమె ప్రశ్నించారు. కాబోయే ప్రధాని నరేంద్రమోదీ అని ఆమె చెప్పారు.

జోరుగా ఓపీఎస్ ప్రచారం

పెరంబూర్, ఏప్రిల్ 6: ప్రజలకు గుర్తుండేలా, పేపర్లలో ప్రచారం లభించేలా అభ్యర్థులు వినూత్న ప్రచారం చేపడుతున్నారు. ఈ కోవలోకే మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ప్రచారం కూడా సాగుతోంది. రామనాథపురం లోక్‌సభ నియోజవర్గంలో బీజేపీ కూటమి తరఫున స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఓపీఎస్ ప్రచారం ముమ్మరం చేశారు. ప్రధాని మోదీ స్వయంగా తాను రామనాథపురం నియోజకవర్గంలో పోటీ చేస్తానని చెప్పారని సభల్లో హోరెత్తిసున్న ఓపీఎస్, ప్రచార సమయంలో రోడ్డు పక్కన ఉన్న దుకాణాలకు వెళ్లి బజ్జీలు కాల్చడం, జ్యూస్ తాగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇలాంటి చర్యలతో మీడియాలో హైలెట్‌గా మారి, ప్రజల్లోకి చొచ్చుకువెళ్లొచ్చని ఆయన భావిస్తున్నారు. ఎటొచ్చి అదే నియోజకవర్గంలో మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు కూడా పన్నీర్‌సెల్వం పేరుతో బరిలో ఉండడమే ఓపీఎస్ మైనస్‌గా మారింది.



బజ్జీలు కాలుస్తూ....జ్యూస్ తాగుతున్న ఓపీఎస్

చిత్రజ్యోతి

కోలీవుడ్ సంగీత దర్శకుడికి టాలీవుడ్‌లో ఆఫర్లు!



నవ్‌ఫాల్ రాజా

తన ప్రతిభతో తమిళ చిత్రపరిశ్రమలో వరుస అవకాశాలు చేజిక్కించుకుంటూ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న యువ సంగీత దర్శకుడు నవ్‌ఫాల్ రాజాకు తెలుగు చిత్రపరిశ్రమలోనూ అవకాశాలు వస్తున్నాయి. ఇదే విషయంపై రాజా మాట్లాడుతూ... 'మా సొంతూరు తిరునెల్వేలి. నాకు పాఠశాల దశ నుంచే సంగీతంపై మక్కువ ఉంది. బాల్యం నుంచే పలు సంగీత వాయిద్యాలపై శిక్షణ పొందా. ఉన్నత విద్యను పూర్తి చేశాక. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, తాజ్‌నూర్ వద్ద ప్రోగ్రామర్‌గా చేశా. అలాగే, ఒక్కో మెట్టు ఎక్కుతూ సంగీత దర్శకుడిగా మారా. తమిళంలో పలు చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించా. తెలుగులోనూ పరిచయమయ్యా. నవీన్‌చంద్ర, సాయికుమార్ నటించిన 'అర్థ శతాబ్దం' మూవీకి సంగీతం అందించాను. అలాగే, 'రుద్రాంగి', 'నరకాసు' వంటి పలు చిత్రాలకు మ్యూజిక్ సమకూర్చా. ప్రస్తుతం మరో ఐదు చిత్రాలకు సంగీతం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నా. అలాగే, తమిళంలోనూ పలు చిత్రాలు చేస్తున్నా. తమిళంలో తొలి చిత్రానికే ప్రముఖ సినీ గేయరచయిత వైరముత్తు సాహిత్యానికి సంగీత బాణీలు సమకూర్చే అదృష్టం లభించింది. సినిమాకు, సినీ కళాకారులకు భాషా సరిహద్దులు లేవని ప్రేక్షకులు మరోమారు నిరూపించారు' అని ఆయన పేర్కొన్నారు.

11న జీవీ ప్రకాష్ - ఐశ్వర్య 'డియర్' విడుదల



ఆడియో రిలీజ్ దృశ్యం

నెట్‌మగ్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాతలు వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి.పృథ్వీరాజ్ కలిసి నిర్మించిన చిత్రం 'డియర్'. జీవీ ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ హీరోహీరోయిన్లు. ఆనంద్ రవిచంద్రన్ దర్శకుడు. ఈనెల 11న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను తాజాగా చెన్నైలో విడుదల చేశారు. ఇందులో హీరో జీవీ ప్రకాష్ మాట్లాడుతూ... 'నేను నటించిన చిత్రాలు వారానికి ఒకటి చొప్పున విడుదలవుతున్నాయని ప్రతి ఒక్కరూ అంటున్నారు. గత నాలుగేళ్లుగా పడిన శ్రమ వల్లే ఈ చిత్రం వస్తోంది. ఓ రోజున విమానంలో నన్ను చూసిన ఐశ్వర్య... ఈ సినిమా స్టోరీ వినాలని చెప్పారు. స్టోరీ వినగానే కన్నీళ్ళు ఆపుకోలేకపోయా. వెంటనే నటించేందుకు సమ్మతించాను. లైవ్ సౌండ్ కావడంతో ప్రతి ఒక్కరూ పోటీ పడుతూ నటించారు. సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అన్నారు. హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ... 'గత యేడాది నా సంవత్సరంగా కొనసాగింది. ఈ యేడాది జీవీ యేడాదిగా ఉంది. నన్ను ఫ్రైడే హీరోయిన్‌గా పిలిచేవారు. దానికి కారణాలు నాకు తెలుసు. 'డియర్' చిత్రం నా హృదయానికి ఎంతో దగ్గరైంది. ఈ స్క్రిప్టును ప్రతి ఒక్కరూ ఇష్టపడి నటించిన మూవీ. దర్శకుడు ఆనంద్ తమిళ సినిమాకు లభించిన మరో ఆణిముత్యం. అలాగే, ముగ్గురు మంచి నిర్మాతలు పరిశ్రమకు లభించారు. జీవీ మంచి స్నేహితుడు. నేను చెప్పగానే స్టోరీ విని అందులో నటించేందుకు సమ్మతించినందుకు ధన్యవాదాలు. ఇది కచ్చితంగా వైవిధ్యభరితమైన మూవీగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. దర్శకుడు ఆనంద్ రవిచంద్రన్ మాట్లాడుతూ... '2020లో నేను దర్శకత్వం వహించిన తొలి చిత్రం ఓటీటీలో విడుదలైంది. మీడియా మిత్రుల ఆదరణతో చిత్రపరిశ్రమలో ఓ గుర్తింపు పొందాను. ఈ కథ విన్న తర్వాత జీవీ నో చెబుతారని అనుకున్నాను. కానీ, మంచి కథ.. నేను నటిస్తానని చెప్పారు. ప్రతి షాట్ మరింత క్వాలిటీగా వచ్చేందుకు ప్రయత్నిస్తారు. ఈ మూవీ ఆయన బెస్ట్ మూవీగా నిలుస్తుంది. ఇది ఒక రిలేషన్‌షిప్ డ్రామా మూవీ. ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. ఈ నెల 11న విడుదలవుతుంది, ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. ఆ తర్వాత నటి నందిని, నటుడు అబ్దుల్ లీ, నటి రోహిణి, గీతా కైలాసం, గేయ రచయిత కార్తిక్ నేతా, కెమెరామెన్ జగదీష్, నటుడు ఇళవరసు, నిర్మాత వరుణ్ త్రిపురనేని తదితరులు ప్రసంగించారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోండి

● హీరో ప్రశాంత్ పిలుపు ● ఘనంగా బర్త్ డే వేడుకలు



అడయార్, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హీరో ప్రశాంత్ పిలుపునిచ్చారు. ఆయన తన పుట్టిన రోజు వేడుకలను శనివారం చెన్నైలో అభిమానులు, పాత్రికేయలతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ... తాను సినిమాల్లో నటిస్తున్నా, నటించకపోయినా క్రమం తప్పకుండా తన పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్న అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఓటు హక్కు ఎంతో విలువైనదని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, దేవుడు ఇచ్చిన ప్రాణం ఎంతో విలువైనదని, ద్విచక్రవాహనదారులు వాహనం నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దకు జరగరానిది జరిగితే ఆ కుటుంబం కోలుకోలేదన్నారు. పుట్టిన రోజు వేడుకల్లో ప్రశాంత్ తండ్రి, సీనియర్ నటుడు త్యాగరాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కు తమిళ చిత్రపరిశ్రమకు చెందిన అనేక మంది సినీ ప్రముఖులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, 'అంధగాన్' చిత్రంలో హీరోగా నటిస్తున్న ప్రశాంత్... హీరో విజయ్ నటిస్తున్న 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'లో ఓ ముఖ్య పాత్రను పోషిస్తున్న విషయం తెల్సిందే.